క్లుప్తంగా

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



గంగినాయుడు మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: మండల పరిధిలోని దిగువపల్లిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగినాయుడు (42) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబానికి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రకాష్, సర్పంచ్ ఈశ్వరయ్య, నాయకుడు లోకేష్ పాల్గొన్నారు.

మద్యం అమ్మితే కఠిన చర్యలు



చంద్రబాబు కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న సీఐ శంకర్‌నాయక్

తనకల్లు: గంజాయి, కర్ణాటక అక్రమ మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కదిరి రూరల్ సీఐ శంకర్‌నాయక్ హెచ్చరించారు. మండల పరిధిలోని చంద్రబాబు కాలనీ, రెడ్డివారిపల్లిలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజాయి, నాటుసారా, కర్ణాటక మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ఎవరైనా గ్రామాల్లో వీటిని అమ్ముతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు, అల్లర్లు సృష్టిస్తే సహించేది లేదన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ రాంభూపాల్, నల్లచెరువు ఎస్‌ఐ వరలక్ష్మి పాల్గొన్నారు.

ఇరగలమ్మ దేవత గ్రామోత్సవం



ఇరగలమ్మ అమ్మవారు, గొడుగులను ఊరేగిస్తున్న దృశ్యం

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని గోవిందురాజులపల్లిలో ఆదివారం ఇరగలమ్మ అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇరగలమ్మ దేవత ఉత్సవ విగ్రహం, గొడుగులను గ్రామంలో ఊరేగించారు. అనంతరం బందారుచెట్లపల్లి, మండల కేంద్రం మీదుగా అన్నమయ్య జిల్లా గండిమడుగుకు తీసుకెళ్లారు. అక్కడ జలంతో అభిషేకం చేయించి ఊరేగింపుగా స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని నల్లగంగమ్మ ఆలయం వద్ద సింగిల్ విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివారెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామపెద్దలు మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు కురవకపోతే అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గతంలో ఇలా చేయడంతో వర్షాలు కురిశాయని తెలిపారు.

విద్యార్థిని చదువుకు చేయూత



విద్యార్థిని తల్లికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

కొత్తచెరువు: కేశాపురం గ్రామానికి చెందిన ప్రవల్లికకు గౌడ, ఈడిగ ఉద్యోగుల సంఘం నాయకులు ఆర్థికసాయం అందజేశారు. ప్రవల్లిక ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీ చదువుతోంది. పేదరికంతో ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న శ్రీసత్యసాయి జిల్లా గౌడ, ఈడిగ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో దాతలు కెంపరాజు రమణ, కెంపరాజు రాజశేఖర్, కెంపరాజు ఆంజనేయులు స్పందించారు. పోగుచేసిన రూ.35 వేలను ఆదివారం విద్యార్థిని తల్లికి అందజేశారు. బాగా చదువుకోవాలని విద్యార్థినికి సూచించారు. ఉన్నత విద్యకు మరింత చేయూత అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో గౌడ, ఈడిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తలమర్ల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సెక్రెటరీ నాగేంద్ర గౌడ్, ఉపాధ్యక్షుడు నారాయణస్వామి, కార్యవర్గ సభ్యులు మురళీ, బాబు, శివ, రాజేంద్ర, కెంపరాజు భాస్కర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

- సీఎం జగన్ 99 శాతం హామీలు నెరవేర్చారు
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



బుక్కపట్నంలో మహిళకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: గడిచిన నాలుగున్నరేళ్లలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటి ముంగిటకే పారదర్శకంగా పథకాలు అందించిందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రెండో రోజు బుక్కపట్నంలోని తేరు బజారు తదితర వీధుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. ప్రతి ఇంటికీ ఏదో ఒక పథకం రూపంలో ఆర్థికంగా లబ్ధి చేకూరిందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నేరవేర్చామని వెల్లడించారు. నియోజకవర్గంలో ఎక్కడా లేనివిధంగా రెండు పెద్ద జాతీయ రహదారులు ఏర్పాటు చేశామన్నారు. ముదిగుబ్బ–బుక్కపట్నం–పుట్టపర్తి మీదుగా కోడూరు తోపు వరకు రూ.1,750 కోట్లతో 80 కిలో మీటర్ల మేర జాతీయ రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నియోజకవర్గంలో అత్యధికంగా వెళ్తోందన్నారు. ఇందు కోసం ఇప్పటికే టెండర్లు పూర్తి చేశామన్నారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం సైతం అందించటం జరిగిందన్నారు. ఈ రహదారి పనులు త్వరలో ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. ఈ రహదారులు పూర్తయితే రోడ్డు కనెక్టివిటీ పెరిగి పుట్టపర్తి ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలు, కులాలకు అతీతంగా పథకాలు అందించామని గుర్తు చేశారు. గతంలో ఏ ఒక్క ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున అందించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. నిరుద్యోగులకు సచివాలయాల ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పించిన ఘనత జగన్ సర్కార్‌కే దక్కుతోందన్నారు. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలతో పాటు.. ఇవ్వని వాటిని కూడా నెరవేర్చారని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకాలు అందిస్తున్నామన్నారు. ఇంకా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

గడప గడపలో అపూర్వ స్పందన

అంతకుముందు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. పొదుపు మహిళలు హారతులు పట్టారు. వృద్ధులు, మహిళలను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ నాగలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, జిల్లా అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, తహసీల్దార్ కరుణాకర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎస్‌ఐ నరసింహుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి సిద్దరాంపురం కేశప్ప, కొత్తకోట కేశప్ప, సొసైటీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, లాయర్ నాగమల్లీశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ పద్మావతి, మండల మైనార్టీ కమిటీ అధ్యక్షుడు ఖదీర్, మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, బిల్డర్ మల్లికార్జున, గ్రామ కమిటీ అధ్యక్షుడు తల్లం మల్లికార్జున, మహమ్మద్ రఫీ, వైఎస్సార్‌సీపీ నేత, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మహేశ్, సచివాలయ కన్వీనర్ నాగభూషణ, రంగారెడ్డి, ఓబిరెడ్డి, నారాయణ స్వామి, డీలర్లు నాగభూషణ, సలీం, లక్ష్మీనారాయణ పెయింటర్ వెంకటేష్ పాల్గొన్నారు.



బుక్కపట్నంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని కలిసిన భాస్కర్‌రెడ్డి

'గడప గడపకూ మన ప్రభుత్వం' అద్భుతం

పుట్టపర్తి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అద్భుతంగా నిర్వహిస్తున్నారని ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్ల సంఘం గౌరవాధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రశంసించారు. ఆదివారం ఆయన బుక్కపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం గొప్ప వేదికగా నిలుస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థతో పథకాలు పారదర్శకంగ అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రామలింగారెడ్డి పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కదిరి టౌన్: మున్సిపాలిటీలోని షహమీరియా వీధి సచివాలయం, 25వ వార్డు పరిధిలోని చిలీం బాషు వీధి నుంచి సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరగనుంది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి హాజరుకానున్నారు. కార్యక్రమానికి జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఎంపీపీలు, సర్పంచులు, వివిధ శాఖల చైర్మెన్లు, సచివాలయ కన్వీనర్లు, వార్డు వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరుకావాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

నేడు 'స్పందన'

తాడిమర్రి: మండలంలోని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిమర్రిలో రెండు, పెద్దకోట్ల, దాడితోట, పిన్నదరి, కునుకుంట్ల, ఎం.అగ్రహారం, నార్శింపల్లి, చిల్లవారిపల్లి, చిన్నచిగుళ్లరేవు సచివాలయాలతో పాటు తహసీల్దార్ కార్యాలయం కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరి దేవి ఆదివారం తెలిపారు. 11 సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా మండలస్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతిపత్రాలను అందజేయవచ్చన్నారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా నాగార్జున

ధర్మవరం: సీపీఎం పట్టణ కార్యదర్శిగా పట్టణానికి చెందిన నామాల నాగార్జునను ఎంపిక చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామంజినేయులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం జిల్లా నాయకులు ఎస్‌హెచ్‌బాషా సమక్షంలో నాగార్జునను సీపీఎం పట్టణ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నాగార్జున ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడుగా నాలుగేళ్లు పని చేశారు. విద్యా రంగ సమస్యలపై పోరాటాలు చేశారని తెలిపారు.

తొగటవీర క్షత్రియ విద్యార్థులకు పురస్కారాలు



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న తొగటవీర క్షత్రియ సంఘం నాయకులు

ధర్మవరం: పట్టణంలోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 38 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.6 వేలు, మూడో బహుమతిగా రూ.5 వేల చొప్పున అందజేసినట్లు తొగటవీర క్షత్రీయ సంఘం పట్టణ అధ్యక్షుడు బండారు ఆదినారాయణ తెలిపారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి శంకర్ యుగంధర్, కేతా లోకేష్, పూజారి నారాయణ, భాస్కర్ నారాయణ, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఉద్యమంలో భాగస్వాములు కావాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

ధర్మవరం అర్బన్: ప్రజా సైన్స్ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ టీఎం బషీర్, రాష్ట్ర కార్యదర్శి మహేంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు తెలిపారు. పట్టణంలోని సూర్యస్కూల్‌లో ఆదివారం జేవీవీ సభ్యత్వ నమోదు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు, సైన్స్ ఉపాధ్యాయులు, సైన్స్ అభిమానులు జేవీవీలో సభ్యులుగా చేరి ప్రజా సైన్స్ ఉద్యమంలో భాగస్వాములు కావాలని సూచించారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా జేవీవీ రాష్ట్ర వ్యాప్తంగా కళాజాతను నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కోశాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి నరేంద్ర, నాయకులు లోకేష్, సురేష్, నాగేంద్ర, మల్లికార్జున, వాసుకుమార్, ఖలందర్, పర్వతయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత గుంజువారిపల్లి



టోర్నీ నిర్వాహకులతో గుంజువారిపల్లి జట్టు సభ్యులు

తనకల్లు: మండల పరిధిలోని గందోడివారిపల్లిలో నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా గుంజువారిపల్లి జట్టు నిలిచింది. ఆదివారం గుంజువారిపల్లి, గేమేనాయక్‌తండా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన గుంజువారిపల్లి జట్టు 12 ఓవర్లలో 136 పరుగులు చేసింది. అనంతరం 137 పరుగుల విజయలక్ష్యంతో బరిలో దిగిన గేమేనాయక్‌తండా సుధాకర్ ఎలెవన్ జట్టు కేవలం 68 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. విజేత జట్టుకు రూ.10,116, రన్నర్స్‌కు రూ.7,116 నగదును సర్పంచ్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీహరిరెడ్డి, దొరస్వామి, ఆరుద్ర శ్రీనివాసులు, మధు చెరుకూరి అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు మాజీ ఎంపీటీసీ ఆది, హరిప్రసాద్ గౌడ్, నాగరున, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, రవీంద్ర పాల్గొన్నారు.

'పురం'వాసికి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఉమర్ ఫరూఖ్

హిందూపురం: పట్టణానికి చెందిన సామాజిక సేవాకర్త, ముస్లిం నగారా అధ్యక్షుడు ఉమర్‌ఫరూక్ రాజర్షిసాహు ప్రేరణ జాతీయ అవార్డు అందుకున్నారు. ఆదివారం మహారాష్ట్ర కోల్హాపూర్ దమ్మభవన్ చారిటబుల్ ట్రస్టు సమత నగరంలో రాజశ్రీ నేషనల్ చిల్డ్రన్స్ షార్టు ఫిలిం ఫెస్టివల్‌లో రాజర్షి సాహు ప్రేరణ జాతీయ పురస్కారాన్ని ట్రస్టు అధ్యక్షుడు కరుణ విమల్ చేతుల మీదుగా అందుకున్నట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. సామాజిక విద్య, రాజకీయ ప్రజా సేవా రంగాల్లో చేస్తున్న సేవలకుగాను జాతీయ అవార్డు దక్కిందన్నారు.

జూదరుల అరెస్ట్



జూదరులను అరెస్టు చూపుతున్న పోలీసులు

పెనుకొండ: పట్టణంలోని మారుతీనగర్‌లో పేకాట ఆడుతున్న పలువురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలమేరకు... మారుతీనగర్‌లో జూదం ఆడుతున్న విషయం తమ దృష్టికి రావడంతో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. జూదరుల నుంచి రూ. 4070 స్వాధీనం చేసుకొని నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు వెల్లడించారు.

కాంట్రాక్టు పీరియడ్ పొడిగించండి

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ పరిధిలో 2017 నుంచి క్షేత్ర స్థాయిలో రైతులకు కీలకసేవలు అందిస్తున్న మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ (ఎంపీఈవో)కు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు కోరారు. ఆదివారం స్థానిక రూరల్ మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఎంపీఈవోల సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ కాంట్రాక్టు పీరియడ్‌ను పొడిగించి, గత మూడు నెలల వేతనాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఓడీ బేసిస్ కింద చిత్తూరుకు బదిలీ చేసిన వారిని ఇక్కడే 2 వేల ఎకరాలు ఉన్న ప్రాంతాలకు బదిలీ చేయాలని కోరారు. కనీస వేతనాలు రూ.25 వేలకు తగ్గకుండా ఇవ్వాలని, అన్ని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తరహాలోనే ప్రమాద ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని కోరారు. సచివాలయ, ఆర్‌బీకేల్లో ఖాళీల్లో నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండా ఎంపీఈవోలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు కె.రామ్మూర్తి, గంగన్న, సోమశేఖర్, భాగ్యలక్ష్మి, శ్వేత, గీత, అపర్ణ, ప్రశాంతి, రవి పాల్గొన్నారు.

మరువకు తాత్కాలిక మరమ్మతు



దెబ్బతిన్న చెరువు మరువ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రొద్దం: మండలంలోని రొద్దం పెద్దచెరువుకు తాత్కాలిక మరమ్మతు చేపడుతున్నట్లు ఇరిగేషన్ ఇన్‌చార్జ్ డీఈ, జేఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. గత ఏడాది భారీవర్షాలకు చెరువు మలుమార్లు పెద్ద ఎత్తున మరువ పారడంతో మరువ పూర్తిగా ధ్వంసమైందన్నారు. చెరువు ఆయికట్టు రైతులు మరువ పరిస్థితులను ఎమ్మెల్యే శంకరనారాయణ దృష్టికి తీసుకువెళ్లారని చెప్పారు. మళ్లీ వర్షాలు పడితే మొత్తం మరువ తెగిపోతుందని చెప్పినట్లు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే శంకరనారాయణ మరువకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించడంతో ఆదివారం మరమ్మతు పనులు ప్రారంభించినట్లు జేఈఈ తెలిపారు. అదేవిధంగా చిన్నకోడిపల్లి, కందకూర్లపల్లి గ్రామాలకు వెళ్లడానికి చెరువు కట్టపై కంపచెట్లు పేరుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. ఇందులో భాగంగానే ఇరువైపులా పేరుకు పోయిన కంప చెట్లను జేసీబీ ద్వారా తొలగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, నాయకులు నరసింహులు, రాము తదితరులు ఉన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

బత్తలపల్లి: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం సాయం పొందేందుకు అర్హులైన రైతులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ ఓబిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కోసం మండల వ్యాప్తంగా 8,632 మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. వీరిలో 1,918 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోలేదన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా అర్హులైన రైతులకు కేంద్ర ప్రభుత్వం ఏటా మూడు విడతలుగా రూ.2 వేల చొప్పున మొత్తం రూ.6 వేలు రైతుల ఖాతాలకు జమ చేస్తుందన్నారు. ఈ-కేవైసీ చేయించుకోని రైతులు ఆర్బీకేలోని అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి రేపు ప్రవేశ పరీక్ష

బత్తలపల్లి: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న నాలుగు సీట్ల భర్తీకి ఈనెల 20వ తేదీన రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. 6, 7, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న నాలుగు సీట్లకు 23 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 6, 7 తరగతులకు రాత పరీక్ష తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో 50 మార్కులకు పరీక్ష ఉంటుందన్నారు. తెలుగుకు 10 మార్కులు, ఇంగ్లిష్‌కు 10, గణితానికి 15, పరిసరాల విజ్ఞానానికి 15 మార్కులు కేటాయించడం జరిగిందన్నారు. 9వ తరగతి వారికి కూడా 50 మార్కులకు పరీక్ష ఉంటుందని తెలిపారు. తెలుగు 5, ఇంగ్లిష్ 10, గణితం 15, సైన్సు 10, సోషల్, జనరల్ నాలెడ్జ్ 10 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుందన్నారు. విద్యార్థులు 10 గంటలకు పాఠశాల వద్దకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 11 గంటల నుంచి 12:30 వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీలత

కదిరి టౌన్: పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద ఉన్న రాణిపేట ప్రాథమిక పాఠశాలలో ఆదివారం చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ సీవీ మదన్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత కంటి, గుండె, మోకాళ్ల వైద్య శిబిరం నిర్వహించారు. శాంతిరామ్ హాస్పిటల్ నంద్యాల, రోటరీక్లబ్ సహకారంతో నిర్వహించిన శిబిరానికి ముఖ్య అతిథులుగా కదిరి డీఎస్పీ శ్రీలత, డాక్టర్లు రమణయ్య, రామకృష్ణ హాజరయ్యారు. వైద్య పరీక్షల అనంతరం 200 మందిని గుండె, 80 మందిని మోకాళ్ల శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. 60 మందిని కంటి లేజర్ ఆపరేషన్ కోసం నంద్యాలకు పంపించారు. 60 మందికి 2డీ ఈసీహెచ్ఓ, ఈసీజీ పరీక్షలు చేశారు. ప్రతి మూడో ఆదివారం రాణిపేట స్కూల్‌లో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీక్లబ్ సభ్యులు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జూలై 1 నుంచి 'జగనన్న సురక్ష'

కదిరి అర్బన్: మండలంలోని 12 పంచాయతీల్లో జూలై 1వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అంజనప్ప ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి రెండు టీములు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఒకటో టీమ్‌లో తహసీల్దార్ నటరాజ్, ఏఓ వెంకటనారాయణరావు, పంచాయతీ కార్యదర్శి కేదార్‌నాథ్, వీఆర్‌ఓ సాయివర్ధన్ ఉంటారన్నారు. రెండో టీమ్‌లో ఎంపీడీఓ అంజనప్ప, డిప్యూటీ తహసీల్దార్ రవితేజ, పంచాయతీ కార్యదర్శి విజయేంద్ర ప్రసాద్, వీఆర్‌ఓ కుషన్‌కుమార్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. జూలై 1న పట్నం, 3న కాళసముద్రం, 5న యర్రదొడ్డి, 7న కదిరి కుంట్లపల్లి, 10న కొండమనాయునిపాళెం, 12న ముత్యాలచెరువు, 14న కదిరి బ్రాహ్మణపల్లి, 15న ఎగువపల్లి, 17న కుమ్మరవాండ్లపల్లి 18, 19న కుమ్మరవాండ్లపల్లి 20, 21న మోటుకుపల్లి, 22న బూరుగుపల్లి పంచాయతీల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

సీఐ నిరంజన్ రెడ్డికి సన్మానం

నల్లమాడ: నల్లమాడ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తూ బదిలీ అయిన నిరంజన్‌రెడ్డికి ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే ఇక్కడి నుంచి బదిలీ అయిన హెడ్ కానిస్టేబుల్ జగదీష్, కానిస్టేబుల్ మనోహర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్, నల్లమాడ, కదిరి సీఐలు రాజేంద్రనాథ్ యాదవ్, తమ్మిశెట్టి మధు, సూర్యనారాయణ, నల్లమాడ, ఓడీచెరువు, అమడగూరు ఎస్‌ఐలు వలీబాషా, గోపి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఎంఈఓలు వచ్చేస్తున్నారు

కదిరి: ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ పెంచేందుకు మండలానికి ఇద్దరు ఎంఈఓలను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం పని చేస్తున్న ఎంఈఓలు వన్‌గానూ.. కొత్తగా నియమించిన వారిని ఎంఈఓ–2గా పరిగణిస్తారు. ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎంలుగా పని చేస్తున్న వారికి ఎంఈఓ–2గా పదోన్నతి కల్పించింది. వీరికి ఉమ్మడి జిల్లా కేంద్రం అనంతపురంలో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఎంఈఓలకు మండలాలను కేటాయించారు.

మండలం	ఎంఈఓ-2 పేరు
కదిరి	ఓబుళరెడ్డి
తలుపుల	కె.విజయ్‌కుమార్
గాండ్లపెంట	ఎం.శ్రీనివాసులు
ఎన్‌పీకుంట	సుబ్బిరెడ్డి
నల్లచెరువు	ఎన్.చెన్నకేశవ కుమార్
తనకల్లు	బి.కళ్యాణి
ఓడి చెరువు	జె.రమణ
నల్లమాడ	వి.సురేష్‌బాబు
అమడగూరు	సంపూర్ణ
ముదిగుబ్బ	రమణప్ప

రేపు వాహనాల వేలం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 20న బహిరంగ వేలం వేయనున్నట్లు సీఐ రవిచంద్ర ఆదివారం తెలిపారు. సెబ్ స్టేషన్ ఆవరణలో జరిగే వేలంలో పాల్గొనేవారు రూ.3 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో ప్రవేశాలకు విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని వసతి గృహ అధికారిణి సరస్వతి ఆదివారం తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, బీఈడీ, టీటీసీ చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థినులకు సంబంధించి 100 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 30వ తేదీలోపు వసతి గృహంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9704783061 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

సోమందేపల్లి వాసి అయోధ్యలో మృతి

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని పాత ఊరులో నివాసముంటున్న రంగప్ప (65) అయోధ్యలో ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం కొంత మంది విహారయాత్రకు వెళ్లగా.. వారికి వంట చేసేందుకు రంగప్పను తీసుకెళ్లారు. అయితే ఉన్నట్టుండి గుండెపోటుకు గురి కావడంతో రంగప్ప చనిపోయారు. దీంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు రావడానికి ఆయన కుమారుడు విశ్వనాథ్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యకు బయలుదేరి వెళ్లారు.